నమస్తే తెలంగాణ

సిద్ధిపేట

I | హైదరాబాద్, శనివారం 14 డిసెంబర్ 2024 | SIDDIPET

దుబ్బాక వసతి గృహంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

గురుకులాలను విస్మరించిన ప్రభుత్వం

- ప్రభుత్వ తీరుతో తీవ్ర ఇబ్బందుల్లో విద్యార్థులు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, డిసెంబర్ 13 : రేవంత్ సర్కారు గురుకులాలను పట్టించుకోక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం దుబ్బాక ఎస్సీ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాలను రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చలి తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అద్దె భవనంలో సరైన వసతులు లేవని తెలిపారు. డార్మటరీ గదులు లేక తరగతి గదిలో నిద్రిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఎమ్మెల్యే, చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలు, వసతి గృహా లు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపించారు. గురుకులాలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో 49 మంది విద్యార్థులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ సర్కారులో రైతులు, పేదలతో పాటు చివరకు విద్యార్థులు సైతం ఇబ్బందులు తప్పడం లేదన్నారు. గురుకులాల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలు, హామీల అమలులో రేవంత్ సర్కారు ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. దుబ్బాక మాజీ జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి, భూంరెడ్డి, బాలకిషన్‌గౌడ్ ఉన్నారు.

దుబ్బాక ఎస్సీ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ట్రయల్ రన్ సక్సెస్

ట్రయల్ రన్ సక్సెస్ అనంతరం విజయ కేతనం చూపుతున్న అధికారులు

మల్కాపూర్ పెద్ద చెరువులో యుద్ధ ట్యాంకర్ల ట్రయల్ రన్

కొండాపూర్, డిసెంబర్ 13 : సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ పెద్ద చెరువు శుక్రవారం సందడిగా మారింది. కంది ఓడీఎఫ్ తయారు చేసిన రెండు యుద్ధ ట్యాంకులను శుక్రవారం మల్కాపూర్ పెద్ద చెరువులో ట్రయల్‌రన్ చేయగా, విజయవంతం అయ్యాయి. ఓడీఎఫ్ పరిశ్రమ జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో కార్మికులు, ప్రత్యేక పోలీసు బలగాలు మల్కాపూర్ చెరువు వద్దకు తరలివచ్చి యుద్ధ ట్యాంకుల ట్రయల్‌రన్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా కంది ఓడీఎఫ్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ శివశంకర ప్రసాద్ మాట్లాడుతూ.. దేశ రక్షణ అవసరాలకు కావాల్సిన యుద్ధ ట్యాంకులను ఆధునిక టెక్నాలజీతో తయారుచేస్తున్నామని, సంగారెడ్డి జిల్లాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ దేశానికి తలమానికం అని పేర్కొన్నారు. యుద్ధక్షేత్రంలో సైనికులు ఎత్తు పల్లపు ప్రాంతాలతో పాటు సముద్రాల్లో శత్రుసేనలను దీటుగా ఎదుర్కొనేలా ట్యాంక్‌లు తయారు చేశామన్నారు. దేశ రక్షణకు కావాల్సిన యుద్ధట్యాంకులను స్వదేశీ టెక్నాలజీతో కంది ఓడీఎఫ్‌లో తయారుచేస్తున్నట్లు తెలిపారు. బీఎంపీ కన్వర్షన్ వెహికల్, బీఎంపీ ఓవరాయిలింగ్ వెహికల్ యుద్ధ ట్యాంకులను తయారు చేశామన్నారు. ఈ యుద్ధ ట్యాంకులు 14 టన్నుల బరువు ఉన్నప్పటికి నీళ్లలో తేలుతూ పడవలా ప్రయాణం చేయడం దీని ప్రత్యేకత అన్నారు. నీళ్లలో గంటకు 7 నుంచి 8 కి.మీ స్పీడ్‌తో పరుగులు తీస్తుందన్నారు. నేలపై గంటకు 60 కి.మీ స్పీడ్‌తో వెళ్తుందన్నారు. యుద్ధ సమయంలో సైనికులను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించడానికి ఈ యుద్ధ ట్యాంకులు ఉపయోగపడతామని ఆయన తెలిపారు. ఆర్మీకి ఇప్పటి వరకు 2 వేలకు పైగా యుద్ధ ట్యాంకులను కంది ఓడీఎఫ్ నుంచి పంపించినట్లు చెప్పారు. ఓడీఎఫ్‌లో తయారుచేసిన యుద్ధ ట్యాంకులను 20 సార్లు వివిధ రకాల టెస్టులు చేసిన తర్వాత ఆర్మీకి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేసేజర్, ఓడీఎఫ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో పర్యటిస్తున్న ఎండీ గౌతమ్, కలెక్టర్ వల్లూరు క్రాంతి , అదనపు కలెక్టర్లు

ఇండ్ల సర్వే పారదర్శకంగా చేయాలి

రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ ఎండీ గౌతమ్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 13: ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్, కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం లోని చాకలిబస్తీ, శివాజీనగర్, మంజీరా నగర్ కాలనీల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ఆయన పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇండ్లను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ గౌతమ్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ గృహ ప్రణాళికలో అర్హులనే గుర్తించడమే పర్యటన ఉద్దేశం అన్నారు. అర్హులకు ఈ పథకం వర్తింపజేయడానికి పారదర్శకంగా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులకు ఎలాంటి సందేహాలు ఉన్నా మున్సిపాలిటీలో వార్డు అధికారి, గ్రామ పంచాయతీల్లో కార్యదర్శిని సంప్రదించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. వారివెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, గృహనిర్మాణ సంస్థ జిల్లా మేనేజర్ పుష్పలత, తహసీల్దార్ దేవదాస్, డీఈలు, ఏఈలు ఉన్నారు.

సంగారెడ్డిలో పర్యటిస్తున్న ఎండీ గౌతమ్, కలెక్టర్ వల్లూరు క్రాంతి , అదనపు కలెక్టర్లు

ఇంటి వద్ద సేవలకు స్వస్తి

విలీనంతో తప్పని ఆన్‌లైన్ తిప్పలు

- ఇన్నాళ్లు గ్రామ సచివాలయంలోనే పరిష్కారం
- ఇకపై మున్సిపల్ కార్యాలయాలకు పరుగులు
- కాగితాల దరఖాస్తుల్లేవ్.. అంతా ఆన్‌లైన్‌లోనే
- సర్వీసు చార్జీలతో జేబులు గుల్ల.. సేవలు సున్నా
- ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల చుట్టూ తప్పని ప్రదక్షిణలు

సంగారెడ్డి , డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ), పటాన్‌చెరు/ అమీన్‌పూర్: గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడంతో సరికొత్త సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెర లేపింది. పల్లెలను స్వయం ప్రతిపత్తి దిశగా నడిపించేలా బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న 51 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో పాలనాపరమైన ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. గ్రామాల్లో తెల్లకాగితం మీద దరఖాస్తు ఇస్తే సమస్య పరిష్కరించుకునే అవకాశం పోనున్నది. ఏదైనా ప్రభుత్వ శాఖలకు దరఖాస్తు చేసుకోవాలంటే ఆన్‌లైన్ సెంటర్లను ఆశ్రయించాల్సిందే. గ్రామాల్లోనూ ఈ గవర్నెన్స్ సేవలు ప్రారంభమైనప్పటికీ..ఇంటర్‌నెట్ ఆధారిత మౌలిక వసతుల లోపం కారణంగా ఆఫ్‌లైన్ ద్వారా కూడా సేవలు పొందే వెసులుబాటు ఉంది. కానీ మున్సిపాలిటీల్లోకి మారిన తర్వాత ఏ పని కోసమైనా ఆన్‌లైన్ దరఖాస్తు తప్పనిసరి. మున్సిపాలిటీలో చేరగానే పాలనా వ్యవహారాలు మారిపోనున్నాయి.

బలహీనంగా ఈ గవర్నెన్స్..

గ్రామాలకు ఇంటర్నెట్ ఫలాలను అందించాలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-గవర్నెన్స్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. గత ప్రభుత్వం కూడా అందుకు అనుగుణంగానే టీ ఫైబర్ పాలసీని రూపొందించి మిషన్ భగీరథ తరహాలో ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందేలా కృషి చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఆ దిశగా అడుగులు వేయలేదు. గ్రామ్ స్వరాజ్ పేరిట గ్రామాల్లో అందే సత్వర సేవలకు మున్సిపాలిటీల్లో కలపడంతో వీల్లేకుండా పోనుంది. గ్రామాల విలీనంతో ఈ వ్యవస్థ నిర్వీర్యం కానుండగా.. మున్సిపాలిటీల్లో అందించే సేవల కోసమైన ఆన్‌లైన్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల వెంబడి తిరగాల్సిన దుస్థితి రానున్నది.

అంతా ఆన్‌లైన్‌లోనే..

పింఛన్ కోసం సర్పంచుకో, గ్రామ సెక్రెటరీకో దరఖాస్తు చేస్తే మరుసటి నెల నుంచి పింఛన్ పైసలు ఇంటికే వచ్చేవి. విలీన గ్రామాల ప్రజలకు ఆ సౌకర్యం లేదు. కనీసం గల్లీలో మోరీ పారుతుందని చెప్పుకునే పరిస్థితి కూడా లేదు. అధికార వికేంద్రీకరణతోనే స్థానికంగా సేవలు అందించాల్సింది పోయి... గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఇబ్బందులకు గురి చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. ప్రభుత్వం నుంచి ఏదైనా సేవలు పొందాలంటే గతంలో గ్రామ సచివాలయానికి వెళితే సరిపోయేది. ఇకపై ఆయా గ్రామాల ప్రజలు దూరంలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కార్యాలయాలకు వెళ్లాల్సిన దుస్థితి రానున్నది. మున్సిపాలిటీల్లో చేరిన తర్వాత ప్రతిదీ ఆన్‌లైన్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలను ఆశ్రయించి, దరఖాస్తుల పేరిట జేబులు ఖాళీ చేసుకుంటే గానీ సాధ్యం కాదు.

విలీనం ఒక్కొకొం

నగదు బహుమతి అందజేత

కంది, డిసెంబర్ 13 : సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో వ్యవసాయం థీమ్‌పై రెండు రోజుల పాటు జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ఐహెచ్) 2024 గ్రాండ్ ఫినాలే గురువారం రాత్రి ముగిసింది. ఇందులో దేశవ్యాప్తంగా 200 మందితో కూడిన 26 బృందాలు పాల్గొన్నాయి. ప్రతిభ కనబర్చిన నాలుగు బృందాలకు లక్ష రూపాయల చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులు పీపీఎంసీ,ఐకార్, యూఏఎస్ ధర్వాడ్ నోడల్ అధికారి, ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ దేశాయ్, డాక్టర్ ప్రవీణ్ మల్లిక్, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి నగదు బహుమతులు అందజేశారు. నోయిడా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ, యశ్వంత్‌రావు చవాన్ ఇంజినీరింగ్ నాగ్‌పూర్, అగ్రి టెక్ టైటాన్ వెలింగ్‌కార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెనేజ్ మెంట్ ముంబయి, టెక్నోమేన్ సాల్ట్‌లేక్ కోల్‌కత్తకు చెందిన యువ ఆవిష్కర్త బృందాలు రూ. లక్ష చొప్పున నగదు పురస్కారాలు అందుకున్నాయి.



నగదు పురస్కారాలను అందుకుంటున్న యువ ఆవిష్కర్తలు

సేవలు దూరం..

మా గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయడంతో పన్నుల భారం పడనున్నది. గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు పలు సేవలు అందేవి. ఇప్పుడు మున్సి పాలిటీ చుట్టూ తిరగాల్సి వస్తుంది. మా గ్రామంలో నిరుపేద కుటుంబాలు ఎక్కువగానే ఉన్నాయి. వారికి ఈ నిర్ణయం ఇబ్బందులకు గురిచేస్తుంది..

-ప్రభాకర్, సృజనలక్ష్మీనగర్ కాలనీ, సంగారెడ్డి జిల్లా

పేదలపై భారం పడుతుంది..

మా గ్రామంలో ఎక్కడో కొంతమంది బంగ్లాలు కట్టుకోవడంతో గ్రామమంతా అభివృద్ధి అయిందని అనుకుని పట్టణ పాలన చేయడం పేదలకు భారం మారుతుంది. ఈ చిన్న గ్రామపంచాయతీని మున్సిపాలిటీలో కలిపి ఇంటి పన్నుల మోత మోగించి సామాన్యులపై భారం మోపడం తగదు.

-విక్రమ్ కుమార్, పటేల్‌గూడ, సంగారెడ్డి జిల్లా

జీపీలో ఉంటే సౌకర్యం..

మా గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపడంతో ఒరిగేది ఏమీలేదు పన్నుల మోత తప్ప. అభివృద్ధి చెందిన పట్టణానికి దగ్గరలో ఉన్నంత మాత్రాన మా గ్రామం అభివృద్ధి చెందినట్టేనా.పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుగా పరిస్థితి ఉంది. గ్రామ పంచాయతీగా ఉంటే స్థానికంగా పౌరసేవలు పొందవచ్చు. బల్దియాలో విలీనంతో సేవలు భారంగా మారుతాయి.

-అనిల్,దయార గ్రామం, సంగారెడ్డి జిల్లా

పన్నులు మోపితే ఊరుకోం...

మున్సిపల్ పాలన అని మాపై అధికంగా పన్నులు మోపితే ఊరుకునేది లేదు. మాగ్రామాన్ని మున్సిపాలిటీలో కలిపి పన్నులతో నడ్డి విరుస్తామంటే ఎలాంటి ఉద్యమాలకైనా సిద్ధం.పేదలను దృష్టిలో ఉంచుకొని పన్నులు నిర్ధారించాలి. ప్రభు త్వం ఏక పక్షంగా నిర్ణయం తీసుకుని పేదలను ఇబ్బందులకు గురిచే యవద్దు.జీపీగా ఉంటేనే ప్రజాప్రతినిధులు, అధికారులు అందుబాటులో ఉంటారు.

-ప్రశాంత్,పటేల్‌గూడ, సంగారెడ్డి జిల్లా

హామీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శ

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 13: రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు ప్రజలకు చేసిందేమీ లేదని, సీఎం రేవంత్‌కు మాటలు ఎక్కువ, చేతలు తక్కువ అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఎద్దేవా చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరహార దీక్షకు శుక్రవారం ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలప్పుడు రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలిచ్చాడని, తీరా గద్దెకెక్కాక అన్ని వర్గాలను మోసం చేశాడని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీల అమలుపై తొలి సంతకం పెడతామని రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు కాంగ్రెస్ నేతలు చేసిన వాగ్దానాలు బుట్టదాఖలు అయ్యాయని విమర్శించారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న ప్రభుత్వం 365 రోజులు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. 2023 సెప్టెంబర్ 13న వరంగల్‌లో నిర్వహించిన దీక్షా శిబిరానికి అప్పటి టీపీసీసీ చీఫ్ రేవంత్ హాజరై సమగ్ర శిక్షా ఉద్యోగులకు మద్దతు తెలిపారని, తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. వారికి ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని చింతా ప్రభాకర్ అన్నారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్లు విజయేందర్‌రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, పార్టీ కందిమండల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో మాట్లాడుతున్న వంగ నాగిరెడ్డి, నాయకులు

రైతుకు బేడీలు వేయడం హేయమైన చర్య

రైతుబంధు సమితి సిద్దిపేట జిల్లా మాజీ కన్వీనర్ వంగ నాగిరెడ్డి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 13: లగచర్ల రైతు హీర్యా నాయక్‌ను పోలీసులు బేడీలు వేసి తీసుకెళ్లడం అమానవీయ చర్య అని రైతుబంధు సమితి సిద్దిపేట జిల్లా మాజీ కన్వీనర్ వంగ నాగిరెడ్డి అన్నారు. గుండెపోటు వచ్చినా కనికరం లేకుండా రైతుకు బేడీలు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో నిర్వహించారు. లగచర్ల ఘటనలో అరెస్టైన రైతు ఏమైనా ఉగ్రవాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుల విలువను పెంచితే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల భూములు గుంజుకుంటూ మోసం చేస్తున్నదని విమర్శించారు. రైతుభరోసా, బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నిండా ముంచిందన్నారు. కనీసం ధాన్యం కొనే స్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. 70 శాతం ధాన్యం వ్యాపారులకు రైతులు అమ్ముకున్నారని, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డ దాఖలాలు లేవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బద్దిపడగ కిష్టారెడ్డి, ప్రభాకర్ వర్మ, లక్ష్మారెడ్డి, వెంకటేశం, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

డీడీఎస్ అమ్మిన భూములను అప్పగించాలి

మీడియా సమావేశంలో డీడీఎస్ వ్యవస్థాపక మాజీ డైరెక్టర్ గోపాల్ ,మహిళా సంఘాల సభ్యులు

జహీరాబాద్, డిసెంబర్ 13 : డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులకు తెలియకుండా అమ్మిన భూములు తిరిగి సభ్యులకే చెందేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ డీడీఎస్ వ్యవస్థాపక మాజీ డైరెక్టర్ గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం జహీరాబాద్‌లోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మహిళా సంఘాల సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. 1984 నుంచి 2024 వరకు నియోజవర్గంలోని 75 గ్రామాల్లో మహిళా సంఘాలను ఏర్పాటు చేసి, ఆ తర్వాత పస్తాపూర్‌లో డీడీఎస్ (ప్రాజెక్టు) సంస్థను ఏర్పాటు చేశారన్నారు. ఆయా గ్రామాల పరిధిలో 5వేల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చామని, 43 గ్రామాల్లోని 2,600 ఎకరాల్లో మహిళా సంఘాల సభ్యులతో చిరుధాన్యాలు పండిస్తూ వాటిని కాపాడామన్నారు. డీడీఎస్ సంస్థలోని మహిళా సంఘాల సభ్యుల పిల్లలకు పౌష్టికాహారం కింద చిరుధాన్యాలను అందించినట్లు తెలిపారు. డీడీఎస్‌కు సంబంధించిన రూ. 45 లక్షలను బ్యాంకు డిపాజిట్ చేశామని, ప్రస్తుతం డీడీఎస్ అధీనంలో ఉన్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్ నుంచి వచ్చిన విరాళంతో 23 గ్రామాల్లో 123 ఎకరాల భూమిని కోనుగోలు చేశామన్నారు. డీడీఎస్ సంస్థలకు 75శాతం, మహిళా సంఘాల సభ్యులకు 25 శాతం వాటాతో ఆ భూములను కొనుగోలు చేశామని, అప్పట్లో కొనుగోలు చేసిన భూములను సంఘం సభ్యుల పేరిట ఉంటాయని చెప్పడం జరిగిందన్నారు. సంఘం సభ్యులకు తెలియకుండానే 74 ఎకరాల భూమిని హైదరాబాద్‌కు చెందిన వారికి అమ్మారన్నారు. 1984 నుంచి 2019 వరకు సంఘంలో ఉన్న సభ్యుల ఒక్కొక్కరి పేరిట రూ. 4వేల నుంచి 5 వేలకు డీడీఎస్ చెల్లించారని, ఎఫ్‌డీఆర్, పీడీఎస్ ద్వారా వచ్చిన డబ్బులు సైతం డీడీఎస్ అధీనంలోనే ఉన్నాయన్నారు. డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులకు తెలియకుండా అమ్మిన భూములను తిరిగి ఇవ్వాలని, ఎఫ్‌డీఆర్, పీడీఎస్, డిపాజిట్ డబ్బులను చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఆర్టీవోలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా డీడీఎస్ సంస్థ ప్రతినిధులు అమ్మిన 74 ఎకరాల భూములు తిరిగి మహిళా సంఘాల ఇవ్వడంతో పాటు ఎఫ్‌డీఆర్, పీడీఎస్, డిపాజిట్ డబ్బుల కోసం చెల్లించాలన్నారు. లేనిపక్షంలో మహిళా సంఘాల సభ్యులతో కలసి పోరాటం చేస్తామని మాజీ డైరెక్టర్ గోపాల్ హెచ్చరించారు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న గోపాల్, మహిళా సంఘాల సభ్యులు

డ్రగ్స్ కాదు గంజాయి లభ్యం

పారిపోయిన లారీ డ్రైవర్, క్లీనర్

పట్టుబడిన లారీని చిరాగ్‌పల్లి పీఎస్‌కు తరలించిన అధికారులు

జహీరాబాద్, డిసెంబర్ 13 : సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామ పరిధిలోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీగా గంజాయిని అధికారులు పట్టున్నారు. చెక్‌పోస్టు వద్ద డ్రగ్స్ తరలిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం తెల్లవారుజామున డీఆర్ఐ, నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్, సెంట్రల్ విజిలెన్స్ అధికారుల బృందం ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో అధికారులకు అనుమానం వచ్చి ఏపీలో ఓడరేవు నుంచి లోడ్‌తో వస్తున్న లారీని పట్టుకున్నారు. ఇది గమనించిన లారీ డ్రైవర్, క్లీనర్ అక్కడ నుంచి పారిపోయారు. స్వాధీనం చేసుకున్న లారీని సంబంధిత అధికారులు చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రగ్స్ ఉందని అనుకుని సంబంధిత అధికారులు లారీలో సరుకులను పరిశీలించగా 8 క్వింటాళ్ల గంజాయి పట్టుబడింది. వాటి విలువ రూ. కోటి వరకు వరకు ఉంటుందని తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబర్ 13: జిల్లా పరిధిలో ఈ నెల 15, 16వ తేదీ వరకు జరిగే టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో ఆయా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు గుంపులుగా ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పెట్రోలింగ్ పార్టీలు నియమించినట్లు తెలిపారు. రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల గుర్తింపు కోసం బయోమెట్రిక్ పద్ధతిలో వేలిముద్రలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

గ్రూప్2 పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

మెదక్, డిసెంబర్ 13(నమస్తే తెలంగాణ): మెదక్‌లోని గ్రూప్2 పరీక్షా కేంద్రాలను ఆర్డీవో రమాదేవి శుక్రవారం పరిశీలించారు. పరీక్ష సమయం దగ్గర పడుతున్నందున మెదక్‌లో 11 కేంద్రాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రూప్2 పరీక్షా కేంద్రాలైన గీతా హైస్కూల్ మంబోజీపల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు, గీతా జెఆర్ కళాశాల, సిద్దార్థ్ జూనియర్ కళాశాలలను తనిఖీ చేశామన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి